

## వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

స్వామి వివేకానంద బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి హనుమంతరావు అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మోమిన్‌పేట మండలంలోని టేకులపల్లి హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వివేకానంద సేవా సమితి బాధ్యులు మాధవరెడ్డి, శ్రీనివాస్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

-వికారాబాద్, జనవరి 12

## గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- జూమ్ మీటింగ్ ద్వారా అధికారులతో వివిధ పథకాలపై సమీక్ష



జూమ్ మీటింగ్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 12 : రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో సభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి పై పథకాలను అమలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లను కలుపుకొని ప్రతియేటా ఎకరానికి రూ.12,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. భూభారతి(ధరణి)పోర్టల్‌లో నమోదైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతుభరోసా అర్హులను గుర్తించాలన్నారు. అదేవిధంగా భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఇచ్చేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేయాలన్నారు. రేషన్ కార్డుల జారీలోనూ క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక జరగాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతీ సంప్రదాయాలను
## కాపాడుకోవాలి

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



మొయినాబాద్, జనవరి 12 : భారతదేశ సంస్కృతీసంప్రదాయాలను సంరక్షించుకోవడంతోపాటు మానవుడి మనుగడకు దోహదపడే ప్రకృతిని కాపాడుకుందామని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న ద వెన్యూ ఫంక్షన్ హాల్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన మూలాల్లో గొప్ప సంస్కృతి.. గొప్ప సామాజిక, ధార్మిక విలువలు ఉన్నాయన్నారు. కన్న తల్లిని, జన్మభూమిని, మాతృదేశాన్ని మరువకూడదని చెప్పారు. మనం తెలుగు వారమని తెలుగులోనే మాట్లాడి మన భాష గౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటుదామని పిలుపునిచ్చారు.ఆంగ్ల భాషను నేర్చుకోవచ్చు.. ఆ భాషలో మాట్లాడొచ్చు..కానీ ఇంగ్లిష్ వారిలా మారొద్దన్నారు. సంక్రాంతి పండుగ అంటే ప్రకృతిని పూజించే..ఆరాధించి పండుగ అని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కామినేని శ్రీనివాస్, వైఎస్ చౌదరి పాల్గొన్నారు.

# కాటన్ మాంజాలే వాడాలి

- మైదానాల్లోనే పతంగులు ఎగురవేయాలి
- అవి విద్యుత్ తీగలపై పడితే..లాగొద్దు
- అత్యవసర పరిస్థితులంటే 1912కు కాల్ చేయాలి : ముషారఫ్ ఫరూఖీ




సిటీబ్యూరో: సంక్రాంతి పండుగ రోజుల్లో పతంగులు ఎగురవేయడం ఆనవాయితీగా వస్తున్నదని, అయితే పతంగులు ఎగురవేసేవారు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, ఒకవేళ పతంగులు కానీ, మాంజలు కానీ విద్యుత్ లైన్లపై, విద్యుత్ పరికరాలపై పడితే కరెంటు సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలని, మెటాలిక్ మాంజాలు వాడొద్దని, మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక.. అవి వైర్లపై పడితే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందని సీఎండీ పేర్కొన్నారు. పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలని, తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు.

పతంగులు, మాంజాలు విద్యుత్ వైర్లపై పడినప్పుడు వాటిని వదిలేయాలని, ఒకవేళ వాటిని పట్టుకుని లాగితే విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకొని విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు లేదా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినా 1912కు కాల్ చేసి తమకు సమాచారం ఇవ్వాలని, లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి తెలియజేయాలని, మొబైల్ యాప్ లేదా www.tgsouther npower.org వెబ్‌సైట్‌లో కానీ సమాచారం ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు, ప్రజలకు సూచించారు.

## తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం



హైదరాబాద్, ఆట ప్రతినిధి జనవరి 12 : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన ప్రధాన కార్యదర్శిగా చాతిరి బాబురావు, అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ఆర్.ప్రేమ్‌రాజ్, ఉపాధ్యక్షుడిగా మల్కా కొమరయ్య, సంయుక్త కార్యదర్శిగా రవీనాయక్, కోశాధికారిగా శివశంకర్, కార్యవర్గ సభ్యులుగా అర్జున అవార్డు గ్రహీత జేజే. శోభ, జగన్నాథ్ స్వామి, కల్పనారెడ్డి, నాగమణి, సంతోష్‌సాగర్ ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్ ప్రకటించారు.

## రూ.14 లక్షల ముడి సరుకు సీజ్

**హేమాక్షి బేకర్స్ పరిశ్రమలో.. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు**

నందిగామ, జనవరి 12 : మండలంలోని మేకగూడ శివారులో ఉన్న హేమాక్షి బేకర్స్ పరిశ్రమలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. గడువు ముగిసిన ముడిసరుకు వాడుతున్నట్లు గుర్తించి, సీజ్ చేశారు. వాటి విలువ రూ.14 లక్షలు ఉన్నట్లు, పరిశ్రమపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ పరిశ్రమలో తయారయ్యే బేకరీ పదార్థాలు దేశ, విదేశాలకు సరఫరా చేస్తుంటారని సమాచారం.



పరిశ్రమలో సీజ్ చేసిన ముడి సరుకు

## పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

**పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు**


సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 13వ తేదీ నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ పెస్టివల్ నిర్వహిస్తుండటంతో పరేడ్‌గ్రౌండ్ పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా గ్రౌండ్ పరిసరాలలో ట్రాఫిక్ మళ్లింపు అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుందని వెల్లడించారు. పరేడ్ గ్రౌండ్ 1వ, ఈస్ట్‌గేట్‌లను సాధారణ పబ్లిక్ ఎంట్రీ కోసం వాడుకోవాలని సూచించారు. వాహనాలు పరేడ్‌గ్రౌండ్ ఈస్ట్, వెస్ట్‌గేట్ కుడిపక్కన(వీఐపీ), కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్, జింఖానా గ్రౌండ్, బైసన్ పోలో గ్రౌండ్‌లలో పార్కింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న ట్రాఫిక్ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని, ప్రత్యామ్నాయ రూట్లలో వాహనదారులు ప్రయాణించి ఇబ్బందులేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

**కిక్కిరిసిన రహదారులు...**

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి తమ సొంత ఊర్లకు వెళ్లే వారితో జాతీయ రహదారులు కిక్కిరిస్తున్నాయి. శనివారం విపరీతమైన రద్దీ ఉండగా ఆదివారం మధ్యాహ్నం వరకు కూడా అదే విధంగా సాగింది. ఈ నేపథ్యంలోనే నగరం నుంచి బయటకు వెళ్లే వాహనాలతో బెంగుళూర్, ముంబై, విజయవాడ, వరంగల్, రాజీవ్ రహదారి, నిజామాబాద్ రహదారులు వాహనాలతో నిండిపోయాయి. ఎక్కువగా బెంగుళూర్, విజయవాడ రహదారులలో వాహనాలు కన్పించాయి. విజయవాడ రహదారిలోని చౌటుప్పల్‌లోని పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాలు వేగంగా వెళ్లేలా రాచకొండ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## కరోటిడ్ ఆర్టరీ డిసెక్షన్ ఆపరేషన్ విజయవంతం

శేరిలింగంపల్లి, జనవరి 12: ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న 29 సంవత్సరాల యువకుడికి 20 నిముషాల్లో కరోటిడ్ ఆర్టరీ డిసెక్షన్ విధానం ద్వారా ఆపరేషన్ నిర్వహించి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడి కేర్ హాస్పిటల్ వైద్యులు పునఃర్జన్మ ప్రసాదించారు. అతి క్లిష్టమైన వాస్కులర్ ఇబ్బందులను ఈ శస్త్రచికిత్సతో తొలగించినట్లు కేర్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన రాకేశ్‌గుప్తా కొంతకాలంగా మెడనొప్పి, వాంతులతో పాటు తీవ్రమైన గుండెనొప్పితో బాధపడుతూ గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌లో చేరారు. ప్రముఖ సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ కైలాశ్‌మిర్చి నేతృత్వంలో వైద్యపరీక్షలు నిర్వహించిన కేర్ వైద్యులు రాకేశ్‌గుప్తా కరోటిడ్ ఆర్టరీ డిసెక్షన్‌తో అతడు ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే త్రింబోలిసిస్ వైద్య ప్రక్రియను ప్రారంభించి పూర్తిచేశారు. రోగి గుండెకు సరైన రక్త సరఫరాను పునరుద్ధరించడానికి త్రింబోలిసిస్ (క్లాట్ లైజింగ్ ఏజెంట్ ప్రక్రియ) ద్వారా మెరుగైన చికిత్సను అందించినట్లు కేర్ వైద్యులు డాక్టర్ కైలాశ్‌మిర్చి తెలిపారు.




# 25% అపరాధ రుసుం

## ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరించుకోకుంటే.. భారీ పెనాల్టీ

**ఏప్రిల్ 1 తర్వాత దరఖాస్తులపై అదనంగా 50% రెన్యువల్ చేయించుకోకుంటే 100% జరిమానా.. నెలకు అదనంగా 10%..**

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న ట్రేడర్లు తమ లైసెన్స్‌లను ఈ ఏడాదికి పునరుద్ధరించుకోవాలని బల్దియా అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబర్ 31తో ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిందని, వీరంతా ఈ నెల 31లోగా తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ప్రతి ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణపై రూ.5వేలు విధించబడుతుందని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌లో జాప్యం చేస్తే లైసెన్స్ ఫీజుకు అదనంగా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31వ తేదీ మధ్యలో రెన్యువల్ చేస్తే 25 శాతం అపరాధ రుసుం, ఏప్రిల్ 1 తర్వాత లైసెన్స్‌లను పునరుద్ధరిస్తే రెన్యువల్ దరఖాస్తులపై అదనంగా 50 శాతం అపరాధ రుసుంగా వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్స్ లేని వారు కూడా ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారాలు నిర్వహిస్తే 100 శాతం పెనాల్టీ విధించడంతో పాటు నెలకు 10శాతం అదనపు పెనాల్టీని విధిస్తామని పేర్కొన్నారు. కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో, ఈ-సేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సిటీజన్ సర్వీస్ సెంటర్లు, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం , సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్, కొత్త ట్రేడ్ లైసెన్స్‌లను పొందేందుకు కావాల్సిన సమాచారం కోసం జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ WWW.GHMC.GOV.IN ను సంప్రదించాలని కమిషనర్ సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ట్రేడర్లకు సూచించారు.

### 5 లక్షల మందిపై ఫోకస్

గ్రేటర్‌లో ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా, ఫీజులు ఎగ్గొడుతున్న వ్యాపారస్తులపై జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. నగరవ్యాప్తంగా లక్షల్లో వ్యాపారాలు కొనసాగుతుంటే ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం పెరగడం లేదు. ఈ నేపథ్యంలోనే లైసెన్స్‌లు లేకుండా వ్యాపారస్తులు, ఫీజులు చెల్లించని వారి పట్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆదాయం పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఒక్కో సర్కిల్‌కు 20 ప్రత్యేక బృందాలను నియమించారు. వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేదా? చెక్ చేయనున్నారు. లైసెన్స్ లేకపోతే పెనాల్టీతో పాటు ఫీజులు వసూలు చేయనున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోని వారి పట్ల చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు దాదాపు 5 లక్షల మంది వ్యాపారస్తుల ఫోన్ నంబర్లకు సంక్షిప్త సందేశాలను పంపించారు.

## బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టుపై అధ్యయనం

**ట్రాన్సాక్షన్ అడ్వయిజరీని నియమించుకునే పనిలో హెచ్‌ఎండీఏ**
**బీపీపీ పరిధిలోని ప్రాజెక్టుల స్థితిగతులపై అంచనా వేయనున్న ఏజెన్సీ**

సిటీబ్యూరో, జనవరి 12(నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ పరిధిలోని బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టుపై అధ్యయనం చేసేందుకు కొత్తగా ట్రాన్సాక్షన్ అడ్వయిజరీ(టీఏ)లను నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయగా, టీఏల ద్వారా బీపీపీ ప్రాజెక్టును అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది. హైదరాబాద్ నగరానికి ప్రధాన పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా ఉన్న ట్యాంక్ బండ్ పరిసరాల్లో టీఏల ద్వారా అధ్యయనం చేసి, అందుకు తగినట్లు అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

**కొత్తగా టెండర్లు ఖరారు చేసేందుకు..**

రీక్రియేషనల్ జోన్‌గా గుర్తింపు పొందిన బీపీపీ పరిధిలో లుంబినీ పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, పీపుల్ ప్లాజా, ఎన్టీఆర్ ఘాట్, సంజీవయ్య పార్క్, లేక్ వ్యూ పార్క్, ఎకో పార్క్, లుంబినీ లేజర్ షో, పీవీ జ్ఞాన్ భూమి, హుస్సేన్ సాగర్ లేక్, వెట్ ల్యాండ్ ఏకో కన్జర్వేషన్ జోన్ వంటి పర్యాటక ప్రాంతాలు ఉండగా, వీటిని నిత్యం, ముఖ్యంగా వారాంతాల్లో వేలాది మంది సందర్శిస్తుంటారు. ఈ క్రమంలో వీటిపై ఆదాయాన్ని పెంచడం, కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేయడం, నూతన టెండర్లకు అవసరమైన నివేదికలను రూపొందించడం వంటి పనులను చేపట్టేందుకు కొత్తగా టీఏలను నియమించుకునే పనిలో ఉన్నారు. ప్రస్తుతం పలు రకాల టెండర్ ప్రక్రియల ద్వారా ఎంపికైన వారు, సేవలను అందిస్తున్నారు. కొత్తగా టెండర్లు ఖరారు చేసేందుకు ఏజెన్సీలను నియమించుకోనున్నారు. ఈ ఏజెన్సీలన్నీ కలిసి హౌస్ కీపింగ్ నుంచి లైసెన్సుల జారీ వరకు అన్ని నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించనున్నది.

## ఆ జీవోను వెంటనే రద్దుచేయాలి

**మందకృష్ణ మాదిగ డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

రవీంద్రభారతి, జనవరి 12 : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు ఈ నెల 8న ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సారథిలో ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్న కళాకారుల స్వేచ్ఛను హరించేలా సర్క్యులర్‌ను జారీచేశారని... అప్రజాస్వామికంగా ఉన్న దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆ సర్క్యులర్ గురించి సీఎం రేవంత్‌రెడ్డికి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు తెలిసిందని అనుకోవడంలేదన్నారు. దీని వెనుక డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నిర్ణయం ఉందని భావిస్తున్నానని ఆయన వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ శక్తులు కాంగ్రెస్ పార్టీలో బలంగా ఉండడంతో బహిరంగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల రూపంగా ఉండే మాల సామాజిక వర్గం వాళ్లే వర్గీకరణకు వ్యతిరేక చర్యలు చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడం అంటే కాంగ్రెస్ పార్టీని శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ధిక్కరించడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెండో స్థానంలో ఉన్న మల్లు భట్టి విక్రమార్క ఈ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గద్దర్ కుమార్తె వెన్నెలను సారథి చైర్మన్‌గా నియమించడంలో భట్టివిక్రమార్క పాత్ర చాలా బలంగా ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు దరువు ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నేత నలిగంటి శరత్‌మాదిగ, ఇస్మాయిల్, పాటల రచయిత మాట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జాప్యానికి తావులేకుండా..

**పునాదులు పడేంత వరకు.. ఉద్యమ కార్యాచరణ**
**నార్త్ సిటీ మెట్రో విషయంలో ప్రత్యేక చర్యలు**



సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ ) : పునాదులు పడేంత వరకు నార్త్ సిటీ మెట్రో ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వం మూడు నెలల్లో డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించినా... మెట్రో నిర్మాణంలో పునాదులే అత్యంత కీలకమని చెబుతున్నారు. ఈ క్రమంలో హెచ్‌ఎంఆర్‌ఎల్ డీపీఆర్ సిద్ధం చేసినా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనులు మొదలుపెట్టేంత వరకు ఉద్యమించాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులను కలుస్తూ డీపీఆర్ ప్రాధాన్యత, మెట్రో నిర్మాణంలో ప్రభుత్వ సహకారం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూనే, తమ ప్రాంతానికి మెట్రో నిర్మాణానికి మేడ్చల్ మెట్రో సాధన సమితి కృషి చేస్తూనే ఉంది.

### ఎల్బీ నగర్ - హయత్‌నగర్ రూట్‌లో మెట్రో స్టేషన్లు ఇవే..

కొత్తగా నిర్మించనున్న ఎల్బీ నగర్-హయత్ నగర్ మార్గంలో మెట్రో స్టేషన్లపై మెట్రో సంస్థ కీలక ప్రకటన చేసింది. ఈ మార్గంలో ఏర్పాటు చేయనున్న స్టేషన్లను ఇప్పటికే డీపీఆర్‌లో పొందుపరచగా... తాజాగా వాటికి సంబంధించిన మెట్రో మ్యాపును మెట్రో సంస్థ విడుదల చేసింది. ప్రతిపాదిత మెట్రో కారిడార్-8లో భాగంగా ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్‌కు 7.1 కిలోమీటర్ల మేర విస్తరించనుండగా, ఇందులో ఎల్బీనగర్, చింతల్‌కుంట, వనస్థలిపురం, ఆటోనగర్, లెక్చరర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, హయత్ నగర్ ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా మియాపూర్ నుంచి పటాన్‌చెరూ వరకు 13.4 కిలోమీటర్లు పూర్తి అయితే గనుక... హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరూ వరకు మొత్తం 50 కిలోమీటర్ల మేర పొడువైన మెట్రో లైన్ అందుబాటులోకి రానున్నది.

### డీపీఆర్ సిద్ధం చేసినా..

గడిచిన ఏడాదిన్నర కాలంగా మెట్రో నిర్మాణంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి విశేషంగా కృషి చేస్తున్నది. అన్ని పార్టీలు, స్థానిక కమ్యూనిటీలతో సామాజిక ఉద్యమ స్ఫూర్తిగా నార్త్ సిటీ మెట్రో అభివృద్ధికి ముందుకు సాగుతున్న క్రమంలో గల్లీ నుంచి ఢిల్లీ స్థాయిలో సామాజిక పోరాటం తరహాలో మెట్రో కోసం ఉద్యమించింది. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా అనుకూలంగా స్పందించే వరకు ఒత్తిడి చేయగా... అదే తరహాలో మెట్రో నిర్మాణంలో అత్యంత ముఖ్యమైన పునాదులు పడేంత వరకు ఉద్యమించాలని భావిస్తున్నది. డీపీఆర్ సిద్ధం చేసినా.. మెట్రో నిర్మాణంలో జాప్యానికి తావులేకుండా ఉండేలా పోరాటం కొనసాగించనున్నారు.

### దశల వారీగా..

ఫేజ్-2 పార్ట్ బీలో ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు మెట్రో నిర్మించేలా డీపీఆర్ సిద్ధమవుతున్నా... ప్రాజెక్టు పనులు మొదలయ్యేంత వరకూ నిష్క్రమించొద్దని వాదనలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు కూడా దశల వారీగా ప్రాధాన్యత క్రమంలో మెట్రో నిర్మించే యోచనలో ఉంది. తొలి దశలోనే తమ ప్రాంతానికి అవసరమైన మెట్రో పనులు మొదలయ్యేంత వరకు ఉద్యమ కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే తమ ప్రాంతానికి లబ్ధి జరుగుతుందంటున్నారు. లేదంటే ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపట్టే సరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుందని, అలాంటి జాప్యానికి తావు లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రెండు మార్గాల్లోనే మెట్రో నిర్మాణం ముఖ్యపాత్రను పోషిస్తున్న నేపథ్యంలో... పనులు పూర్తయ్యేంత వరకు మెట్రో నిర్మాణంపై స్థానికుల్లో అవగాహన కల్పించనున్నారు.